# గెలుపు?

ఆర్. టి. సి. బస్ గతుకుల రోడ్డుమీద దబ దబ లాడుతూ ఊరికి అరమైలు దూరంలోవున్న మంచులూరు వంతెనమీద ఆగి...అక్కడ శంకరాన్ని దించేసి మళ్ళీ దుమ్ము రేపుతుంటూ పరుగుతీసింది.

శంకరం మంచులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్. ఐ. గా వచ్చాడు. ఇదే అతనికి ఫస్ట్ పోస్టింగ్.

శంకరం ఉత్సాహవంతుడయిన యువకుడు గ్రాడ్యుయేట్. అతనికి చిన్నతనంనుంచీ పోలీస్ డిపార్టుమెంట్ అంటే చాలా యిష్టం.

చిన్నప్పుడు వాళ్ళింటి పక్కనుండే కానిస్టేబుల్ కనకయ్య అతని గురువు. ఎప్పుడూ ఆయనదగ్గర కెళ్ళి పోలీసు కావడానికి యేం చదువుకోవాలో, ఏ ఏ అర్హతలుండాలో అడిగి తెలుసుకుంటూండేవాడు.

ఆటలు ఆడినా దొంగా పోలీసు ఆట తప్ప ఆడేవాడు కాదు పోలీసు డిపార్టుమెంట్ అంటే జానానికున్న భయానికి నవ్వుకునేవాడు.

రేపు తనూ ఓ పెద్ద పోలీసైతే అందరూ తనకి జడుస్తారు. సారాకొట్టు కాంతయ్య ఒంగి దణ్ణాలు పెడతాడు. కిళ్ళీకొట్టు చంద్రయ్య తను అడక్కుండానే సోడా కొట్టిస్తాడు. తనతో పోట్లాడిన రావిగాణ్ణి ఎంచక్కా లాక్కొచ్చి జైల్లో పడేయవచ్చు! ఇలా ఉండేవి అతని పసితనపు ఆలోచనలు.

అయితే ఊహ తెలిశాక అతనికా డిపార్టుమెంట్ అంటే మోజు పోనూలేదు. కాకపోతే ఊహలు, భావాలు మరో రకంగా సాగేవి.

ఎక్కడ చూసినా పోలీసుల అక్రమాలు, లంచగొండితనాలు, నిరంకుశత్వం లాంటి పదాలెన్నో అతను వింటున్నాడు.

అతనికా పరిస్థితి ఎంతో బాధ కలిగించేది.

అందుకే తప్పకుండా పోలీసు శాఖలో చేరి, పోలీసులూ మనుష్యులే! ఉద్యోగరీత్యా కాస్త కాఠిన్యం చూపించినా వారికీ జాలీ, దయా లాంటివి ఉంటాయనీ, మానవత్వం పూసిపోదనీ జనానికి విప్పి చెప్పాలి.

అలా కాక తాను విన్న వినాదాలు నిజాలే అయితే అలాంటివార్ని మంచిమాటలతో మార్చాలి! ప్రభుత్వం ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని నచ్చచెప్పాలి!

డిపార్టుమెంట్‌లో కష్టపడి పనిచేసి మంచి పేరు తెచ్చుకుని త్వరలో ప్రమోషన్ మీద ప్రమోషన్ సంపాయించాలి! కలకాలం పేరు నలుగురూ గొప్పగా చెప్పుకోవాలి! ఇలా

వుండేవి అతని ఆలోచనలు. అతని ఆశలుతీరే సమయం రానే వచ్చింది.

శంకరం ఎస్. ఐ. అయ్యాడు.

"ఎక్కడికి బాబూ?"

ఆలోచనల్లో మునిగిపోయిన శంకరం తృళ్ళిపడి చూశాడు.

ఎదురుగా ఓ రిక్షా అతను.

చాలా ముసలతను.

ఓసారి చుట్టూ చూశాడు శంకరం.

మరో రిక్షా అయినా లేదు.

ఊరికి దూరంగా ఉండడానకాబోలు రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది.

అంత ముసలతని రిక్షా ఎక్కడం అంత యిష్టం లేకపోయినా, ఊరు కొత్తవడాన. మరో రిక్షా అతను లేకపోవడాన ఆ రిక్షానే ఎక్కాలనుకున్నాడు శంకరం.

"మంచులూరు పోలీస్టేషన్‌కు వస్తావా?" అన్నాడు.

"ఎక్కండి బాబూ!" అన్నాడతను వినయంగా.

శంకరం రిక్షా ఎక్కాడు.

రిక్షా అతను గంట మోగిస్తూ మట్టి రోడ్డుమీద ఉత్సాహంగా తొక్కుతున్నాడు.

శంకరం చుట్టూ పొలాలు, చెట్లు చూస్తూ కూర్చున్నాడు.

"ఎంతయినా ఈ పల్లెలు పెద్దగా మారలేదు. పోలీ స్టేసన్ ఉన్నా మంచి రోడ్డయినా లేదు. నయం ..కాస్త ఈ రిక్షా అయినా దొరికింది" అనుకున్నాడు మనసులోనే.

"టేషనులో తమకి పనేటి బాబూ?" రిక్షా తొక్కు-తూనే అన్నాడు రిక్షా అతను.

"పనుంది లే!"

"సెప్పండి బాబూ? క్లోళ్ళు గినపోనాయా!"

"ఉహూం!"

"మరి...సారాకొట్టు కిట్టిగాడు అల్లరిగిసెట్టినాడేటి?" కుతూహలంగా అడిగాడతను.

"సారాకొట్టు కిట్టిగాడా? అతనెవరు?" అన్నాడు శంకరం.

చిత్రంగా చూశాడు రిక్షా అతను.

"ఏటి? కిట్టిగోడు తెలవదా? అసలు తమదీ పేంత మేనా?" అనుమానంగా అడిగాడు రిక్షా అతను.

"ఊఁహూ!"

"అదిగట్టా సెప్పండి! ఈ పేంతంలో కిట్టిగోడు తెలవ నోడుంటాడా? ఇంతకీ తమదేపూరు బాబూ?"

చెప్పాడు శంకరం.

"అబ్బో శానాదూరం! మరైతే మా పోలీసోళ్ళంతో మీాకు పనేటి బాబూ?" అయోమయంగా అన్నాడతను.

"నేను మంచులూరు పోలీస్టేసనులో ఎస్. ఐ. గా వచ్చాను" కాస్త గర్వంగా అన్నాడు శంకరం.

తృప్తిపడ్డాడు రిక్షా అతను.

"ఏటీ?"

"అదే నేను మీ పోలీస్టేషన్‌లో సబిన్స్పెక్టర్ని! అతని ముఖంలోని భయానికి ముసిముసిగా నవ్వుతూ అన్నాడు శంకరం.

రిక్షా ఠక్కున ఆగిపోయింది.

"ఏమిటి స్టేషన్ కొచ్చేశామా?" అన్నాడు శంకరం పరిసరాలు చూస్తూ.

"ఉఁహుఁ!"

"మరి రిక్షా ఆపేశావేం?"

"అదంతే! రిచ్చా దిగు!" అన్నాడతను.

"ఎందుకు?"

"సెప్తాగానీ...ముందు రిచ్చా దిగు!"

అతని ధోరణికి కొయ్యబారిపోయాడు శంకరం. అంత వరకు ఎంతో మర్యాదగా మాట్లాడిన అతను ఏకవచనంతో కొట్టినట్టు మాట్లాడుతున్నాడు.

"ఏయ్! నీకే చెప్పేది...రిచ్చా దిగు" కర్కశంగా అన్నాడు మళ్ళీ అతను.

శంకరం అవమానంతో దహించుకుపోయాడు.

"ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?" కఠినంగా అన్నాడు.

"తెలుసు తెలుసులేవయ్యా! ఇదే ఇంతకుముందు తెలిస్తే నా రిచ్చా నీ శాయలకూడా తెచ్చేవాణ్ణికాదు.

అయినా మీ పోలీసోళ్ళ సంగ తెవడికి తెలవదు" దూకుడుగా అనేసి, రిక్షా కూడా వదిలేసి ఊరికేసి నడిచిపోతున్న రిక్షా అతన్ని చూస్తూ శిలలా నిల్చుండిపోయాడు శంకరం.

*　　　　*　　　　*

మండిపడుతూ తను చెప్పిన విషయానికి తేలిగ్గా నవ్వేసిన హెడ్ కానిస్టేబుల్ పైడయ్యని చూస్తూవుంటే చిరాకేసింది శంకరానికి.

అతని చిరాకు గమనించిన పైడయ్య—

"అతనో పిచ్చాడు సర్!" అన్నాడు మెల్లిగా.

"పిచ్చాడా?"

"అవును! అతని పేరు వీరయ్య. బిడ్డనికని భార్య కన్నుమూస్తే ఆ పసికందును గుండెల్లో పెట్టుకుని, తల్లీ తండ్రీ తానే అయి పెంచుకున్నాడు. ఏళ్ళతరబడి కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో కూతురి పెళ్ళిచెయ్యాలని నిర్ణయించుకుని, పిల్ల తన కళ్ళముందే ఉంటుందన్న ఆశతో ఓ మంచి సంబంధం ఇల్లరికం వచ్చేలా కుదుర్చుకున్నాడు. తీరా పెళ్ళిబట్టలు అవీ తేవడానికి పట్నం వెళ్ళి వచ్చేసరికి కూతురి శవం ఊరి బావిలో తేలింది.

అతనికి లోకం స్తంభించి పోయింది.

పోస్ట్‌మార్టంలో ఆ పిల్లని యెవరో రేప్ చేసినట్టు తేలింది. ఉగ్రుడయ్యాడు వీరయ్య.

అతనిలోని దుఃఖాతిశయం తగ్గకుండానే తన కూతుర్ని నాశనం చేసినవాణ్ని కాలరాచిగానీ నిద్రపోనని కఠోర శపథం చేశాడు.

ఆ వేటలో అతని అనుమానం పోలీస్ కానిస్టేబుల్ వెంకటేసు మీద నిల్చింది.

కారణం ఆ పిల్లంటే అతనికి చాలా అభిమానం. అదీ గాక ఆరోజు పొద్దుపోయాక వెంకటేసు వీరయ్య యింటివైపు నుంచి రావడం తాము చూశామని యెవరో వీరయ్య చెవిలో ఊదారు.

అంతే! ఇంక అతన్నాపడం ఎవరితరంకాలేదు. ఓ రోజు వెంకటేసు గొంతు పట్టుకుని దాదాపు అతన్ని మృత్యుముఖం లోకి లాక్కెళ్ళాడు.

ఎలాగో నలుగురూ చేరి అతన్ని రక్షించారు.

ఇంక తనిక్కడుండడం ఎవరికీ క్షేమం కాదనుకున్న వెంకటేసు ఎక్కడికో ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళి పోయాడు.

అప్పట్నించీ పోలీసుల్ని, పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని దుమ్మెత్తిపోస్తూ తిరిగాడు కొన్నాళ్ళు. ఆపై మతిస్థిరం కూడా తప్పింది.

బావున్నరోజున కూలీ కెళతాడు, లేనిరోజు యే అరుగు మీదో ముడుచుకుపడుకుంటాడు. దయుగలతల్లి ఓ ముద్దపడేస్తే తింటాడు. లేకపోతే అలాగే పస్తులుంటాడు.

మరో విషయం తెలుసా? ఆ రిక్షా అతనిది కాదు. ఏ రిక్షా కనిపిస్తే అది లాక్కెళ్ళిపోతాడు. అయినా అతని పూర్వ చరిత్ర తెలిసిన యెవరూ అతని చేతల్ని, మాటల్ని అంతగా పట్టించుకోరు.

ఎంత పిచ్చిలోవున్నా వీరయ్యకి పోలీసులంటే ఉన్న కోపంమాత్రం తగ్గలేదు. వీరయ్య కథముగించాడు పైడయ్య.

శంకరం మనసు ఆవేదనతో బరువెక్కింది. మౌనంగా నిట్టూర్చాడు.

*　　　　*　　　　*

ఎన్నోరకాలుగా కలలుకన్న శంకరం ఆశయాలు కలలుగానే మిగిలిపోయాయి.

అతననుకున్నట్లు పోలీసులంటే జనానికి గౌరవంలేదు, భయం మాత్రమే! తెగించినవారికి అదీ లేదు. అంతేకాదు, తోడేళ్ళలాంటి ఊరి పెద్దలు కొందరికి పోలీస్ డిపార్ట్‌మెంట్ ఓ కవచంలాంటిదని కూడా అతి త్వరలో తెలుసుకున్నాడు.

సారాకొట్టు కిష్టయ్యంటే తమ డిపార్ట్‌మెంట్‌కే హడల్ అని తెలుసుకున్నరోజు సిగ్గుపడ్డాడు.

ఆ కిష్టయ్యకి ఊరిపెద్దల మద్దతు తద్వారా పోలీసుల సహాయం ఉందని విని కృంగిపోయాడు.

పరుగులుతీసే యువకరక్తంతో కొన్ని దుష్టశక్తులకు యెదురుతిరగాలని ప్రయత్నించిన శంకరానికి ఎదురుదెబ్బ మిగిలింది.

అనుభవం వున్న హెడ్‌కానిస్టేబుల్—

అనవసర విషయాల్లో తల దూర్చొద్దని, కోరి ఆపదలు తెచ్చుకోవద్దనీ యెన్నోవిధాల నచ్చచెప్పాడు.

"అయితే జరిగే ఘోరాలు జరుగుతుంటే ఇంక మనం ఎందుకు?" ఆవేశంగా అన్నాడు శంకరం.

అతని అమాయకత్వానికి నవ్వొచ్చింది పైడయ్యకి. "కోపగించుకోకండి సర్! నా సర్వీసంత లేదు మీ వయస్సు! కొన్ని కొన్ని మనం చూసినా చూడనట్టుండాలి" అన్నాడు అనునయంగా.

"అంటే!"

"మరేం లేదు, విషయం మనదాకా వచ్చినప్పుడే మనం కల్పించుకుందాం."

"అంటే, జరిగే నేరాలు జరుగుతుంటే మనకి పట్టనట్టు, చేతులు ముడుచుకుని కూర్చుందామా? అందుకేనా ప్రభుత్వం మనకి జీతాలిచ్చేది!" అతని రక్తం ఉడికిపోతోంది.

"అలా అని కాదు ... కాస్త చూసీ చూడనట్టు ఉండాలి."

"అలా ఉండకపోతే!"

"చాలా విషమ పరిస్థితులెదుర్కోవాల్సొస్తుంది. మూడు రోజులకో వూరు మారాల్సొస్తుంది."

"అంతే కదా? వృత్తిని నమ్ముకున్నవాడికే ఊరైతేనేం? అయినా యిలాంటివాటికి భయపడి ఆత్మవంచన మాత్రం చేసుకోలేను" స్థిరంగా ఉంది శంకరం గొంతు.

పైడయ్య జాలిగా నవ్వాడు.

"బాబూ! ఒక్కమాట చెప్పనా?"

"ఏమిటి?"

"మీలాగే దురాచారాల్ని ఖండించాలని చూశాను. ఆశయాల జగత్తులో తేలిపోయాను. ఎంతోమంది పెద్దల ఆటలు కట్టించి తెలివిగా ప్రభుత్వానికి అప్పజెప్పాను. ఫలితం యేమిటో తెలుసా?" పైడయ్య శరీరం ఒణికింది.

"ఏమయింది?" ఆతృతగా చూశాడు శంకరం.

"నా భార్య, చెల్లెళ్ళ శవాలు వీరయ్య కూతురిలాగే ఊరి బావిలో తేలాయి!" కంట్లో పూరిన నీటిని కొనగోటితో తుడుచుకుంటూ అన్నాడు పైడయ్య.

"పైడయ్యా!"

"అవును సర్! ఏ పెద్దమనుషుల్ని నేను దుర్మార్గులుగా నిరూపించానో వారే నా భార్య చెల్లెళ్ళ మానప్రాణాలు పొట్టన పెట్టుకున్నారు.

"నన్నే అబద్ధాలకోరుగా ప్రభుత్వంముందు నిలబెట్టారు. అందుకే యిన్నాళ్ళయినా ఎదుగూ, బొదుగూ లేకుండా ఇలా ఉన్నాను. మరో సంగతి తెలుసా బాబూ?"

"ఏమిటది?"

"మన వీరయ్య కూతుర్ని పాడుచేసింది కూడా అలాంటి పెద్దలే! నేరాన్ని తెలివిగా వెంకటేసుమీదికి నెట్టి తాము తప్పించుకున్నారు.

సాక్ష్యాధారాలు దొరకనందున యెవరూ శిక్ష అనుభవించలేదుగానీ వీరయ్య మనసులో మాత్రం వెంకటేసు దోషిలా నిల్చిపోయాడు" వివరించాడు పైడయ్య.

"అయితే వాళ్ళసంగతి ఖచ్చితంగా చూడాల్సిందే" పిడికిలి బిగించాడు శంకరం.

♦ ♦ ♦

మంచులూరు బొస్ హాలు పరిసరాలన్నీ కిటకిటలాడి పోతున్నాయి.

ఎవరినోట విన్నా శంకరం మాటే! ఏ పేపరు చూసినా ఎస్. ఐ. శంకరం గురించిన పొగడ్తలే! ప్రతి పేపరులోనూ అతని ఫోటో ఫ్రంట్ పేజిలో పడింది ఇటీవల.

కారణం శంకరం పెద్ద ఘనకార్యమే చేశాడు. ఎవరూ సాధించలేని ఘనవిజయాన్ని సాధించాడు. ఎంతోమంది యువకులకు దారి చూపించాడు.

మితిమీరిన ధైర్యసాహసాలు చూపించి ఆ వూరి టీచర్ సరళతో కలిసి, ప్రాణాలకూడా తెగించి పెరిగి విస్తరిస్తున్న కలుపు మొక్కల్ని ఏరేశాడు. చీడపురుగుల్ని వేరి కాలరాచేశాడు.

ప్రజలదృష్టిలో పోలీసువారంటే ఉన్న అపోహాలన్నీ తొలగించాడు.

అతని ధ్యేయం నెరవేరింది.

ప్రజల దృష్టిలో అతనో హీరో!

అందుకే అతనికారోజు అభినందన సభ ఏర్పాటు చేశారు. పైడయ్య అతన్ని కౌగలించుకుని—

"నిజంగా మీరు చేసినపనికి మన డిపార్ట్ మెంట్ అంతా

గర్విస్తోంది. మేమెవ్వరం చెయ్యలేనిపని, మీరు సాధించారు" అన్నాడు ఆనందంగా.

పిచ్చి వీరయ్య అతని చేతులుపట్టుకుని కళ్ళకద్దుకున్నాడు. ఇంకా అనేకులు అనేక రకాలుగా ప్రశంసించారు.

టీచర్ సరళ ఆనందానికి పట్టపగ్గాల్లేవు, అంతమందిలో అతని కాళ్ళంటి నమస్కరించింది.

చివరికి శంకరం అందరికీ కృతజ్ఞతలు తెల్పుకున్నాడు. ఈ యజ్ఞంలో సహాయపడిన సరళకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

సభ ముగిసింది.

*　　　　*　　　　*

అందరిలో దేవుడిలా నిల్చిపోయిన శంకరం హఠాత్తుగా 'రావణాసురుడై' పోయాడు.

ఊరు ఊరంతా ముక్కున వేలేసుకుంది. ఆడవాళ్ళు దుమ్మెత్తిపోశారు.

కారణం ఎస్. ఐ. శంకరం ఓ తెల్లవారుఝామున టీచర్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

వారికోసం టీచర్ మేనత్త కొడుకు, కాబోయే భర్త అయిన అనంత్ చాలాచోట్ల గాలించాడు. "తనని ప్రాణప్రదంగా ప్రేమించిన సరళ హఠాత్తుగా మారిపోయి, ఇక్కడుంటే ఎలాగూ బయట పడుతుందని ఎక్కడికో లేచిపోయిందంటే అది కేవలం ఆ శంకరం చేసిన పనే!" అని పళ్ళు నూరుకున్నాడు.

అయినా ఫలితం శూన్యం!

కలవపుపెట్టి మరో ఊరు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడని కూడా విన్నారు.

పైడయ్యకి కూడా అంత మంచి వ్యక్తి ఒక్కసారి ఎందుకలా మారిపోయాడో అర్థంకాలేదు.

"ఎప్పటికయినా కనిపించడా? ఉద్యోగం కోసమైనా అజ్ఞాతవాసంలోంచి బయటపడ్డా? అప్పుడు స్వయంగా వెళ్ళి 'ఎందుకిలాంటి పనిచేశావ్? నీకు ఆ పిల్లంటే మనసయితే ధైర్యంగా నలుగురికీ చెప్పి పబ్లిగ్గా పెళ్ళిచేసుకోక, ఈ వెధవ పని చేశావేమిటి? అందరికీ నీతులు చెప్పి ఇప్పుడు నువ్వు చేసిన పనేమిటి?' అని నిలదీసి అడగనా!" అనుకున్నాడు ఆవేదనగా.

కానీ శంకరంగానీ, సరళగానీ యింక జీవితంలో ఎవరికీ కనిపించరనిగానీ, జెయిలుమీద వచ్చిన సారాకొట్టు కిష్టయ్య, మిగతా పెద్దలు కలిసి వాళ్ళిద్దర్నీ చంపేసి మంచులూరు భూమిలోనే సమాధి చేశారనిగాని, ఎవరికీ అనుమానం రాకుండా లేచిపోయినట్లు కథలల్లారనిగానీ పాపం! పైడయ్యకి తెలియదు. పైడయ్యకే కాదు, చాలామందికి తెలియదు.

(ముత్యాలసరం)

)—•—(